క్లుప్తంగా

నేడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చెరుకుపల్లి: మండలంలో రెండు వలంటీర్ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. బలుసులపాలెం సచివాలయ పరిధిలో (బీసీ జనరల్), చెరుకుపల్లి-2 సచివాలయ పరిధిలో (ఓసీ జనరల్) వలంటీర్ పోస్టులకు 8 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులను ఈ నెల 31వ తేదీలోగా ప్రకటించి, నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

సదరం క్యాంపు.. పది మందికి ధ్రువపత్రాలు

వేమూరు: సదరం క్యాంపు ద్వారా దివ్యాంగులకు ధ్రువపత్రాలు మంజూరు చేసినట్లు డాక్టరు జయకృష్ణ తెలిపారు. వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్యాంపునకు 14 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 10 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ధృవపత్రాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ

చెరుకుపల్లి: వ్యాస రచన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని బన్నారావూరి సాయి శ్రావ్యకు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి వచ్చిందని చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాపట్లలో సోమవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని రెండవ స్థానం కేవశం చేసుకుందని పేర్కొన్నారు. విజేతలకు చీరాల కస్తూర్బా పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా వైద్యశాఖ అధికారిణి విజయలక్ష్మి, పలువురు జిల్లా అధికారుల చేతుల మీదుగా సాయి శ్రావ్య రూ.5వేలు నగదు, సర్టిఫికెట్ అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థినిని తల్లిదండ్రులు శివకుమార్, పద్మావతి, ఎంఈఓ నవీన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కడుపు నొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

పిట్టలవానిపాలెం: కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. చందోలు ఎస్ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం శివారు మన్నెంవారిపాలేనికి చెందిన మన్నెం లక్ష్మీనారాయణ(29) అనే యువకుడు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఉదయం గ్రామ శివారులోని మినుము పొలాల్లో ఉన్న చెరువు సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దార్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

నేడు ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రాక

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు బాపట్లకు బుధవారం రానున్నారు. రోడ్డు మార్గంలో ఉదయం విజయవాడ నుంచి బాపట్లకు చేరుకుంటారు. గిరిజన హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతారు. నరసాయపాలెం గ్రామంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొని, విజయవాడకు వెళ్తారు.

ఘనంగా సిద్ధి, బుద్ధి సమేత గణపతి బ్రహ్మోత్సవాలు



పెండ్లి కుమారునిగా గణపతి స్వామి

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి, బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారిని పెళ్లి కుమారుడిని చేశారు. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు తనయుడు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దేవాలయ నిర్మాణానికి పాటుపడిన తాడికొండ వంశీయులు ఏటా క్రమం తప్పకుండా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి (చందూ మాస్టర్) ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ పంచామృత అభిషేకం, గురువారం లక్ష కుంకుమార్చన, స్వామివారి కల్యాణం, శుక్రవారం శ్రీ లక్ష్మి గణపతి హోమం, రాత్రి స్వామి వారి దివ్య రథోత్సవం, శనివారం వసంతోత్సవం, ధ్వజ అవరోహణ, శ్రీదేవి భూదేవి సమేత ఆది శేషాచల స్వామివారి కల్యాణం జరుగుతాయని నిర్వాహకులు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే.. 'గడప గడపకు'

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- బాపట్ల నియోజకవర్గంలో 100వ రోజుకు కార్యక్రమం
- ఘన స్వాగతం పలికిన ప్రజలు, నేతలు



మహిళకు కరపత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదలు పెట్టారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మంగళవారం బాపట్ల నియోజకవర్గంలో 'గడప గడపకు' కార్యక్రమం 100వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని వెదుళ్ళపల్లి గ్రామంలో ప్రజలు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే కోన రఘుపతికి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా స్టువర్ట్‌పురం చేరుకొని.. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేకును ఆయన కట్ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేశారు. సమస్యలుంటే ప్రజలు తనకు నేరుగా తెలియజేయాలని చెప్పారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. 2014 ఎన్నికల్లో లెక్కలేనన్ని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబు నాయుడు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని గుర్తుచేశారు. ప్రజలందరినీ.. మోసగించారని మండిపడ్డారు. తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే వంద శాతం సీఎం జగన్ నెరవేర్చారని కొనియాడారు. పేదల అవసరాలను గుర్తించి.. ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ఎప్పటికప్పుడు సీఎం తమను ఆదుకుంటున్నారని ఎమ్మెల్యేతో పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జగనన్నకు తాము అండగా ఉంటామంటూ చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోకిరా గోరెడ్డి, సర్పంచ్ బోగిరి ప్రసాద్, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డిముక్కల డేవిడ్, రాగ మధు, ఆట్ల ప్రసాద్ రెడ్డి, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



వందరోజుల వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ వకుల్ జిందాల్



నాగమల్లేశ్వరికి నగదు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. తెనాలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ 2506)గా విధులు నిర్వహిస్తూ.. అనారోగ్యంతో మృతి చెందిన కె.వెంకటేశ్వరరావు సతీమణి కె.నాగమల్లేశ్వరికి అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.1,00,000ల చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంకిత భావంతో విధులు నిర్వహించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు సాయం అందించడానికి ఎల్లవేళలా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బీ సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక పాల్గొన్నారు.

నదీ భూముల ఆక్రమణ యత్నంలో ఉద్రిక్తత

కొల్లూరు : కృష్ణా నదీ తీరంలోని బుసక మేటలు ఆక్రమణ విషయంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. మండలంలోని పెదలంక అరవింద వారధి వెంబడి నదీ తీరంలో బుసక మేటలు ఆక్రమించుకొని, సాగు చేసుకోవాలని సీపీఎం, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల నాయకుల సమక్షంలో మంగళవారం చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన వ్యక్తులు ప్రయత్నించారు. భూముల్లోకి ప్రవేశించి ముళ్ల కంపలు దగ్ధం చేసే ప్రక్రియకు పూనుకున్నారు. దీనిని గమనించిన ఆ ప్రాంత రైతులు ఆక్రమణల వల్ల నదీ తీరం కోతలకు గురవుతుందని చెట్ల తొలగింపు ప్రక్రియను నిలపాలని కోరినప్పటికీ ఫలితంలేకుండా పోయింది. సమాచారం అందుకున్న ఆర్‌సీ ఏఈ సురేష్ కుమార్, పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని ఆక్రమణలు ఆపాలని సీపీఎం, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల నాయకులకు సూచించారు. అధికారుల సూచనలను బేఖాతరు చేస్తూ.. అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, రెవెన్యూ కార్యాలయం వద్ద పోరాటం చేస్తామని వారు తేల్చి చెప్పడంతో ఆర్‌సీ ఏఈ, పోలీసు అధికారులు వెనుతిరిగారు. ఈ ఘటనపై స్థానిక రైతులు, ఆర్‌సీ ఏఈ కొల్లూరు తహసీల్దార్ శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై ఆర్‌సీ ఏఈ, రైతుల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖకు ఉత్తర్వులిచ్చినట్లు తహసీల్దారు తెలిపారు.

బాలిక చదువు.. ఇంటికి వెలుగు

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాలు



బాలికలను సత్కరిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

పిట్టలవానిపాలెం: బాలిక చదువు ఇంటికి వెలుగునిస్తుందని ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలికలనుద్దేశించి మాట్లాడారు. బాలికలను బాలురతో సమానంగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు అర్జునరావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాలికలు తమ హక్కులు తెలుసుకోవాలి

రేపల్లె: బాలికలు తమ హక్కులను తెలుసుకోవాలని సీడీపీవో మాణిక్యం పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యాన పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గిరికుమారి, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ స్నేహలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో మాణిక్యం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

నిజాంపట్నం: బాలికలను..బాలురతో సమానంగా చదివించాలని నిజాంపట్నం పీహెచ్‌సీ డాక్టర్ కె.స్వప్న పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం ఆధ్వర్యాన నిజాంపట్నం జడ్పీ హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరళ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కె.గౌరీశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.స్వప్న, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గౌరీ శంకర్

ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం...

నగరం: బాలికల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సీఫర్డ్ సచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఫర్డ్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ అడుసుమల్లి ప్రభాకరరావు, నాగేంద్రరావు, నాగేశ్వరరావు, అంగన్‌బాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో..అవగాహన

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో మంగళవారం బాలికా దినోత్సవం పురస్కరించుకుని సీఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు హక్కులు, బాల్య వివాహాలు, పౌష్టికాహారం, రక్షణ, జాగ్రత్తలు, పరిశుభ్రత, మహిళలకు జరుగుతున్న మోసాలను గురించి ఆర్గనైజేషన్ సభ్యులు రమాదేవి వివరించారు. బాలికల గొప్పతనాన్ని తెలియ జేసే గోడ పత్రికలను గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కర్లపాలెం: మధు మేహం, రక్తపోటు ఉన్న వారితో పాటు వయసు పైబడిన వారందరూ తప్పనిసరిగా గుండె వైద్య పరీక్షలు చేయించుకోవాలని విజయవాడ హెల్ప్ హాస్పిటల్ గుండె వైద్యులు జె.సాయి సూచించారు. కర్లపాలెం పంచాయతీ కొత్త ఇస్లాంపేట షాదీ ఖానాలో మంగళవారం మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్ బేగ్, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, మైనార్టీ నాయకుడు ఎస్కే బాషా ఆధ్వర్యంలో వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, గ్రామ సర్పంచ్ నక్కా లలిత కుమారి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ జె.సాయి సుమారు 200 మందికి ఉచితంగా గుండె వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

జీవామృతంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయం అవలంబించడం వల్ల తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని (జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్) జెడ్‌బీఎన్ఎఫ్ యాక్టివిస్ట్ ఎం.వరదానం పేర్కొన్నారు. మండలంలోని ఖాజీపాలెం శివారులో జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జీవామృతాన్ని వాడటం వల్ల మొక్కల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. దీంతో చీడ, పీడలు ఆశించవని వివరించారు. 200 లీటర్ల నీరు, 10 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కిలోల శనగపిండి, 2 కిలోల నల్లబెల్లం, గుప్పెడు పుట్టమట్టి అన్నీ కలిపి వారం పాటు ఉదయం, సాయంత్రం కలియ బెట్టాలని తెలిపారు. వారం రోజుల తర్వాత వినియోగించుకోవచ్చని సూచించారు.

దుకాణాల వేలం ఆదాయం రూ.21వేలు



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి దేవస్థానానికి చెందిన 1, 2 దుకాణాల నిర్వహణకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడారు. మొత్తం 17 మంది పాల్గొన్నారని తెలిపారు. ఆరుగురు ఏడాదికి రూ.21,600లు అద్దె చెల్లించే విధంగా పాట దక్కించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏఎంసీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు 'క్రాస్ కంట్రీ' రన్నింగ్ రేస్

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల 'క్రాస్ కంట్రీ' పురుషుల పరుగు పందెం(10 కి.మీ) బుధవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ మంగళవారం తెలిపారు. అలాగే.. అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు, ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతాయని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్వాతంత్ర్య సమర యోధుల స్తూపం ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.

బీజేపీ ధృతరాష్ట్ర కౌగిలి ముస్లింలకు వద్దు



మాట్లాడుతున్న పఠాన్ రాజేష్, నాయకులు

బాపట్ల అర్బన్: బీజేపీ ధృతకౌగిలి ముస్లింలకు వద్దు అని బాపట్ల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోమ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీ, గుజరాత్‌లోని చట్టసభల్లో, పాలక వర్గాల్లో ముస్లింలు లేకుండా చేసి వారిని రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పూర్తిగా అణిచి వేశారని ఆరోపించారు. ముస్లింల విద్యాభివృద్ధిని అరికట్టిన.. బీజేపీ ధృతరాష్ట్ర కౌగిలిని తాము స్వీకరించలేమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి పాలన సాగించే పార్టీ.. కాంగ్రెస్ మాత్రమేనన్నారు. పట్టణ అధ్యక్షుడు దేవరాజ్, దండు రేణుక, నక్కల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పింది చంద్రబాబే

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: మండలంలోని స్టువర్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ వెయిట్ లిఫ్టర్ రాగల రాహుల్‌పై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివక్ష చూపించి, ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదని ఎమ్మెల్యే కోన రఘుపతి ఆరోపించారు. ఓ దిన పత్రికలో.. 'క్రీడల్లో గెలిచి.. సర్కారు ముందు ఓడి' అనే శీర్షికతో కట్టు కథ అల్లారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా నిరాధారమని మండిపడ్డారు. సీఎం జగన్ రాహుల్‌ను అన్ని విధాల ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వంపై బురద జల్లడం.. కేవలం విషపు పూరిత రాతలు రాసే పచ్చ మీడియాకే చెల్లిందన్నారు. ఇలాంటి రాతలు రాసే వారిపై పరువు నష్టం దావా వేసే విధంగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు అంటే టీడీపీకి.. దానిని సపోర్ట్ చేసే పచ్చ మీడియాకి ఎప్పుడూ లోకువని దుయ్యబట్టారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా.. అని హేళనగా మాట్లాడిన చరిత్ర చంద్రబాబు నాయుడుదని.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదని అన్నారు. ఈ విషయమై.. రాహుల్ తండ్రి రాగాల మధు స్పందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నెలబెట్టుకున్నారని చెప్పారు. ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యాజలి యువకుడికి అరుదైన అవకాశం



ఇక్కుర్తి లక్ష్మీనరసింహ (ఫైల్)

కర్లపాలెం: యాజలి గ్రామానికి చెందిన యువకుడు, యాజలి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ వ్యవస్థాపకుడు ఇక్కుర్తి లక్ష్మీనరసింహకు అరుదైన అవకాశం లభించింది. లక్ష్మీ నరసింహ తెలిపిన వివరాల మేరకు.. అమెరికా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్ విజిటర్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కి హాజరు కావాలని తనకు ఆహ్వానం అందిందని తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 23వ తేదీ వరకు అమెరికాలో ప్రోగ్రామ్ నిర్వహిస్తారని చెప్పారు. రాజకీయాలపై అవగాహన ఉండటం, రైతులకు సేవ చేయటం లాంటి అంశాలపై తనను ఎంపిక చేసి ఆహ్వానించారని లక్ష్మీనరసింహ తెలిపారు.

వైభవంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

కర్లపాలెం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం రాత్రి శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు విశేష పూజలు నిర్వహించారు. వాసవి క్లబ్, క్వీన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వాసవి క్వీన్స్ క్లబ్ అధ్యక్షులు ఎక్కల నాగశ్వేత, కార్యదర్శి నాలం అనిత, వాసవి క్లబ్ అధ్యక్షుడు టి.లక్ష్మణ కుమార్, కార్యదర్శి వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, లలితబాబు, రాంబాబు, చంద్రం, చేబ్రోలు విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 41వ మంగళవారం హరిద్ర శృంగార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడారు. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బీమా సంస్థకు ఏజెంట్స్ కీలకం



సీనియర్ ఏజెంట్స్‌ను సన్మానిస్తున్న ఫెడరేషన్ నాయకులు

బాపట్ల : జీవిత బీమా సంస్థకు ఏజెంట్స్ కీలకమని బ్రాంచి మేనేజర్ జి.గోపాలరావు పేర్కొన్నారు. బాపట్ల లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏజెంట్స్ ప్రొఫెషన్ ప్రొడక్షన్ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.గోపాలరావు మాట్లాడుతూ..ఏజెంట్లు వారి వృత్తిని గొప్పగా భావించి ముందుకు పోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ ఏజెంట్లు సీహెచ్ అంకయ్య, బి.సాంబయ్య, కేవీఎల్ నరసింహారావు, పి.మోహనరావు, రామిరెడ్డి, దత్తత్రేయలను సన్మానించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేపల్లె రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.నాగమల్లీశ్వరి కోరారు. ఈ మేరకు పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో మంగళవారం సీడీపీవో మాణిక్యంకు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు అందించాలని కోరారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్ వై.కనకదుర్గ, పీవీ నాగలక్ష్మి, ఎం.త్రివేణి, ఎ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో మాణిక్యంకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీలు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమాదేవి, నిర్మల జ్యోతి, చలమ్మ, సూర్యలక్ష్మి, శారద పాల్గొన్నారు.

పంటకాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కొల్లూరు : ట్రాక్టర్ అదుపు తప్పి..పంట కాల్వలోకి దూసుకు వెళ్లిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని దోనేపూడి శివారు మగ్గాలపాలెంలో ఈ ప్రమాదం మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెరుకుపల్లి మండలం వాకవారిపాలేనికి చెందిన డ్రైవర్ వాక అర్జునరావు కలప లోడ్ ఉన్న ట్రాక్టతో దోనేపూడి వస్తున్న క్రమంలో స్పీడు బ్రేకర్‌ను గమనించిక.. అకస్మాత్తుగా బ్రేకు వేశాడు. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి.. రేపల్లె-తెనాలి ప్రధాన రహదారి వెంబడి పంట కాల్వలోకి దూసుకువెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అర్జునరావుపై పడిన కలపను తొలగించి.. కాపాడారు. క్షతగాత్రుడు అర్జునరావును వైద్య సేవల నిమిత్తం 108 వాహనంలో చెరుకుపల్లి వైద్యశాలకు తరలించారు.

ఓటు హక్కుపై వ్యాసరచన పోటీలు

నగరం: విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కలిగించేందుకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో మంగళవారం ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఆవశ్యకత అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అవగాహన

భట్టిప్రోలు: భట్టిప్రోలు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) సహకారంతో కళాజాత బృందం మంగళవారం స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులకు ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. పొదుపు, బ్యాంకుల వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్ మోసాలు, జీరో బ్యాలెన్స్ అకౌంట్, ఓపెనింగ్ గురించి వివరించారు. కళాజాత బృందం నాటికలు ప్రదర్శించింది. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సి.రామ కోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.